[redacted] 14 SEP 2020 ENADU

## ఆక్సిజన్ ప్లాంటును పరిశీలించిన మల్లాడి

యానాం: ఆరోగ్యశాఖామంత్రి మల్లాడి కృష్ణారావు ఆదివారం సాయంత్రం ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంటును పరిశీలించారు. అనంతరం అక్కడ చికిత్స పొందుతున్న కరోనా రోగులను పరామర్శించారు.

**యానాం:** యానాంలో ఆదివారం ఉదయం వరకు 255 నమూనాలను పరీక్షించగా 38 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని ఆరోగ్యశాఖ డైరెక్టరు ఎస్.మోహన్‌కుమార్ తెలిపారు.

## డిగ్రీ పరీక్షల తేదీల్లో మార్పు

యానాం: పుదుచ్చేరి యూనివర్శిటీ పరిధిలోని కళాశాలల్లో సోమవారం నుంచి నిర్వహించ తలపెట్టిన డిగ్రీ ఫైనల్ సెమిస్టర్ పరీక్షలను ఈ నెల 21కి వాయిదా వేస్తున్నట్లు పరీక్షల కంట్రోలర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

[redacted] ANDHRA JYOTHI

14 SEP 2020

## సెంట్రలైజ్డ్ ఆక్సిజన్ పనుల పరిశీలన

యానాం, సెప్టెంబరు 13 కరోనా నియంత్రణలో భాగంగా యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న సెంట్రలైజ్డ్ ఆక్సిజన్ పనులను ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు పరిశీలించారు. పుదుచ్చేరి నుంచి ఆదివారం యానాం వచ్చిన ఆయన ప్రభుత్వాసుపత్రిని పరిశీలించారు. ఈసందర్భంగా కరోనా నియంత్రణకు చర్యలపై సమీక్షించారు. ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఐసోలేషన్ వార్డుకు పీపీఈ కిట్‌తో వెళ్లి కొవిడ్ బాధితులను పరామర్శించారు. ఆయన వెంట ఆరోగ్యశాఖ డీడీ కాశి సత్యనారాయణ ఉన్నారు.

### 1300కు చేరిన కరోనా కేసులు

యానాంలో ఆదివారం నమోదైన 29పాజిటివ్‌లతో కలిపి కొవిడ్ కేసుల సంఖ్య 1306కి చేరింది. రోజుకు 300పైగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైరస్‌తో ఇప్పటివరకు 34మంది మృతిచెందగా 349 మంది డిశ్చార్జ్ అయ్యారు. ప్రస్తుతం 323 కొవిడ్ కేసులు యాక్టివ్‌లో ఉన్నాయి.

14 SEP 2020 SAKSHI

## నిబంధనలు ఉల్లంఘిస్తే హోమ్ ఐసోలేషన్ రద్దుచేస్తాం

మంత్రి మల్లాడి

**యానాం:** కరోనా బారిన పడి హోమ్ఐసోలేషన్‌లో చికిత్సపొందుతున్న వారు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారం బాహ్యాప్రపంచంలో తిరుగుతామంటే వారి హోమ్ఐసోలేషన్‌ను రద్దు చేస్తామని పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హోమ్ఐసోలేషన్‌లో ఉండేవారు ఇంటి వద్ద పాటించాల్సిన నియమాలకు అనుగుణంగా వ్యవహరించాలని ఒంటరిగా ఉండాలే తప్ప కుటుంబసభ్యులతో కలిసి పోవడం వల్ల ఆ కుటుంబంలో మరిన్ని కేసులు నమోదు కావడానికి ఆస్కారం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే దానికి అందరూ సహకరించాలన్నారు.

నియోజకవర్గ పరిధిలో జీజీహెచ్, వివిధ కోవిడ్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని రోగనిరోధక శక్తి పెరిగేలా మంచి పౌష్టికాహారం, మందులు ఇస్తున్నామని ఆవిధంగా త్వరగా బాధితులు కోలుకుంటున్నారని మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. అనంతరం ఆయన జీజీహెచ్, బీసీ హాస్టల్, మెట్టకూరు హైస్కూల్ తదితర ప్రాంతాల్లో చికిత్సపొందుతున్నవారితో మాట్లాడారు. కార్యక్రమంలో జీజీహెచ్ డీడీ కాశి సత్యనారాయణ, వైద్యులు నవీన్, డీటీ జయచంద్రన్ పాల్గొన్నారు.

## పోలీసులకు కోవిడ్ పరీక్షలు నిర్వహణ



పోలీసులకు కోవిడ్ పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

**యానాం:** ఆంక్షల కాలం నుంచి అవిశ్రాంతంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులకు శని, ఆదివారాలు రెండు రోజుల పాటు కోవిడ్–19 పరీక్షలును నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో వైద్యశాఖ ఆధ్వర్యంలో కరోనా పరీక్షలను నిర్వహించారు. 107 మంది పోలీసులకు, 20 మంది పోలీసుల కుటుంబసభ్యులకు కరోనా పరీక్షలను నిర్వహించారు. అదే విధంగా కరోనా కంటైన్‌మెంట్ జోన్‌లలో విధులను నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు బాధిత రోగుల బాగోగులు తెలుసుకుంటూ వారికి జాగ్రత్తలు చెబుతున్న 16 జోన్ల కానిస్టేబుల్స్‌కు సైతం కోవిడ్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్పీ భక్తవత్సలం, సీఐ గూటం శివగణేష్, ఎస్ఐలు కట్టా సుబ్బరాజు, కనకారావు, ఆల్ఫాన్స్‌రాజు పర్యవేక్షించారు.

## 1278కి చేరిన పాజిటివ్ కేసులు

**యానాం:** నియోజకవర్గ పరిధిలో ఆదివారం కొత్తగా 39 పాజిటివ్ కేసులు నిర్ధారణ కావడంతో పాజిటివ్ కేసుల సంఖ్య 1278కి చేరుకున్నాయి. జీజీహెచ్‌లో 188మంది, హోమ్ ఐసోలేషన్‌లో 109 మంది చికిత్స పొందుతుండగా 949 మంది చికిత్సపొంది ఆరోగ్యవంతంగా డిశ్చార్జి అయ్యారని 34 మంది మృతిచెందారని పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సర్వీసెస్ ఒక ప్రకటనలో తెలిపారు.

14 SEP 2020 PRAJA SAKTHI

## ఆసుపత్రిలో సిబ్బంది నియామకం

**యానాం :** కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో మూడు నెలల పాటు తాత్కాలికంగా విధులు నిర్వహించేందుకు నర్సింగ్, శానిటరీ, హెల్త్ సిబ్బందిని నియమించామని యానాం పరిపాలనాధికారి శివరాజ్‌మీనా తెలిపారు. వీరికీ రెండు రోజుల పాటు శిక్షణ పొందిన తరువాత విధులకు హాజరవుతారని పేర్కొన్నారు.

14 SEP 2020 ANDHRA PRABHA

## కరోనా వైరస్ బాధితులకు మెరుగైన సదుపాయాలు ..మంత్రి మల్లాడి

**యానాం ప్రభ న్యూస్ :** యానాం నియోజకవర్గంలోని చికిత్స పొందుతున్న కరోనా వైరస్ బాధితులకు మరింత మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు వైద్య సిబ్బందికి సూచించారు ఆదివారం సాయంత్రం పుదుచ్చేరి నుంచి యానం చేరుకున్ని నేరుగా ప్రభుత్వ ఆసుపత్రి లోని కరోనా వైరస్ బాధితుల వార్డు కు వెళ్లి వారికి అందిస్తున్న సదుపాయాలపై అడిగి ఆరా తీశారు ఇకపై మరిన్ని మెరుగైన సదుపాయాలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు అదేవిధంగా మెట్టకూరు, బీసీ హాస్టల్ తదితర ప్రాంతాల్లో చికిత్స పొందుతున్న కరోనా వైరస్ బాధితులను ఆయన స్వయంగా కలిసి మాట్లాడారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారి కాశి సత్యనారాయణ, డాక్టర్ నవీన్, డిప్యూటీ తాసిల్దార్ చంద్రన్ పాల్గొన్నారు

